


రైతుకు ఊరట

• ధాన్యం సొమ్ము విడుదల • రైతుల ఖాతాల్లో రూ. 423 కోట్లు జమ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ధాన్యం బకాయిల నమూనా చెక్కులు సోమవారం ఏలూరులో అందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైతులకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం బకాయిలను విడుదల చేసింది. రైతు ఖాతాల్లో జమచేసే ప్రక్రియ పూర్తి చేసింది. వైసీపీ హయాంలో రబీ ధాన్యం సొమ్ము రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1600 కోట్లు పెండింగ్‌లో పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత రూ. 1000 కోట్లు విడుదల చేశారు. వైసీపీ హయాంలో సొమ్ములు విడుదల కాకపోవడంతో రైతులు యాతన పడ్డారు. బాకీ తీర్చ లేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి జిల్లాలో రూ. 946 కోట్లు బకాయిలున్నాయి. తొలుత రూ. 523 కోట్లు చెల్లించారు. తాజాగా సోమవారం ఏలూరు జిల్లాలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పశ్చిమగోదావరి జిల్లాకు రూ.423 కోట్లు విడుదల చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)


వైసీపీ హయాంలో రైతులకు సకాలంలో ధాన్యం బకాయిలు విడుదల చేయక పోవడంతో ఇబ్బంది పడ్డారు. ఖరీఫ్‌కు పెట్టుబడి కోసం తంటాలు పడ్డారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు బటన్ నొక్కింది. వాటిని విడుదల చేయకుండా తాత్సారం చేసింది. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత పథకాల సొమ్ములు లబ్ధిదారుల ఖాతాలో జమ కాలేదు. ఎన్నికలు ముగిసిన తర్వాత మంజూరయ్యాయి. అప్పుడు కూడా రైతు బకాయిలపై వైసీపీ ప్రభుత్వం బకాయిలు విడుదల చేయలేదు. రైతులు బ్యాంకుల నుంచి నోటీసులు అందుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు వడ్డీ రాయితీ కూడా వైసీపీ ప్రభుత్వం విడుదల చేయలేదు. గడచిన ఐదేళ్లపాటు రైతులు ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు పడ్డారు. సక్రమంగా ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఒకవేళ విక్రయించినా సరే సొమ్ములు జమ అవుతాయన్న గ్యారంటీ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సమస్యలపై దృష్టి పెట్టింది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలు సోమవారం విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఇక 48 గంటల్లో జమ

మున్ముందు రైతులకు సకాలంలో సొమ్ములు చెల్లించాలని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదిశగా పౌరసరఫరాల కార్పొరేషన్‌కు ఆదేశాలు జారీచేశారు. వాస్తవానికి కేంద్రం నుంచి ధాన్యానికి సంబంధించి సొమ్ములు సమకూరుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను దారిమళ్లించింది. పౌరసరఫరాల కార్పొరేషన్ పీకల్లోతు అప్పుల్లోకి నెట్టింది. దాంతో సకాలంలో సొమ్ములు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నిధులు కేటాయించేంత వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ సారి అలా కాకుండా రైతులకు సకాలంలో సొమ్ములు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఖరీఫ్ నుంచి రైతు కష్టాలు తొలగిపోనున్నాయి. వైసీపీ హయాంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఒక మండలంలో రైతుకు వేరే మండలంలో మిల్లుకు ధాన్యం అమ్మకానికి కేటాయించేవారు. దీనివల్ల రైతులకు అదనపు వ్యయం అయ్యేది. రవాణా ఛార్జీలు తడిసి మోపెడయ్యేవి. వాహనాలు దొరకడం కష్టమయ్యేది. భవిష్యత్తులో అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం నిబంధనలు అమలు చేయాలని రైతులనుంచి వినతులు వెళుతున్నాయి.

మిల్లర్లకు ఎప్పుడో..?

వైసీపీ ప్రభుత్వం రైతులకే నస పెట్టింది. బకాయిలు సక్రమంగా విడుదల చేయకుండా చుక్కలు చూపించింది. రైతులకు బకాయిలు చెల్లించిన తర్వాతే మిల్లర్లకు బిల్లులు చెల్లిస్తూ వస్తోంది. ఇప్పటికీ అదే ఒరవడి కొనసాగుతోంది. దాంతో జిల్లాలో మిల్లర్లకు బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు రూ.350 కోట్ల మేర బకాయిలు ఉండిపోయాయని మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. ఒక దశలో వైసీపీ నేతలు కమీషన్‌లు తీసుకొని బిల్లులు మంజూరు చేశారు. రాష్ట్రంలో అందరి మిల్లర్లకు రూ.400 కోట్ల బకాయిలు విడుదల చేశారు. ఇప్పటికీ జిల్లాలోనే రూ. 350 కోట్లు బకాయిలున్నాయి. బియ్యం రవాణా ఛార్జీలను కూడా వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు కూడా మంచి రోజులు వస్తాయని మిల్లర్లు ఆశతో ఉన్నారు.



మత్స్యకారుల వెతలు

- భృతి కోసం ఎదురుచూపు
- ఇప్పటికే వేట నిషేధం ఎత్తివేసి రెండు నెలలు
- పట్టించుకోని అధికారులు

నరసాపురం, ఆగస్టు 12: మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇచ్చే భృతి అందని ద్రాక్షగా మారింది. నిషేధ ఆజ్ఞలు ఎత్తివేసి రెండు నెలలు గడిచింది. కానీ నేటికి మత్స్యకారుల ఖాతాల్లో భృతి సొమ్ము మాత్రం జమ కాలేదు. షెడ్యూల్ ప్రకారం ఈ సొమ్ము మే నెలలో జమ చేయాల్సింది. అయితే ఎన్నికల కారణంగా వాయిదా వేసింది. ఫలితాలు వచ్చి రెండు నెలలు గడిచింది. నేటికీ వీరికి మాత్రం మోక్షం కలగలేదు. ఏటా ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు సముద్ర వేటను నిషేధిస్తూ వస్తుంది. ఆ సమయంలో మత్స్య సంపద పునరుత్పత్తి ఎక్కువగా ఉంటుంది. వేటాడితే సంపద హరించిపోతుందన్న ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా రెండు నెలల పాటు నిషేధ ఆజ్ఞలు అమలు చేస్తూ వస్తున్నారు. ఈ సమయంలో మత్స్యకారులకు నెలకు రూ.10వేలు చొప్పున భృతి ఇవ్వడం ఆనవాయితీ. దీన్ని మే లేదా జూన్ నెలల్లో ఇస్తారు. కానీ ఈసారి నిషేధ ఆజ్ఞలు ఎత్తివేసినా ఇంత వరకు భృతి మాత్రం దక్కలేదు. దీనిపై మత్స్యశాఖ అధికారులు భిన్నవాదనలు వినిపిస్తున్నారు. మొన్నటి వరకు మత్స్యకారుల ఖాతాలను ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ఇప్పుడు తాజాగా మళ్లీ రీ సర్వే చేస్తున్నట్లు చెప్పడం గమనార్హం. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సముద్ర వేట సాగించే మత్స్యకారులు 1770 మంది ఉన్నారు. వీరందరికీ రూ.20వేలు చొప్పున భృతి అందించాల్సి ఉంది. కానీ నేటికి జమ కాకపోవడంతో వీరంతా మత్స్యశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వెంకన్నకు పెరిగిన ఆదాయం

మొదటి పాట రూ. 2.50 లక్షలే

రద్దు చేయించిన కూటమి నేతలు

రెండోసారి రూ. 12.62 లక్షలు

పెంటపాడు, ఆగస్టు 12: పెంటపాడు మండలం పరిమళ్ళ గ్రామంలో తిరుమల వెంకటేశ్వరస్వామికి 14 ఎకరాల భూమి ఉంది. ఓ దాత స్వామి వారికి ఆ భూమిని సమర్పించారు. అప్పటినుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పాట నిర్వహిస్తూ వస్తోంది. వైసీపీ హయాంలో అత్యంత తక్కువ కౌలుకే పాట వెళ్లేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వైసీపీ సానుభూతి పరులు గుట్టు చప్పుడు కాకుండా పాటను దక్కించుకున్నారు. గ్రామంలో పాట విషయం ఎవ్వరికీ తెలియదు. దాంతో 14 ఎకరాల భూమికి ఏడాదికి సుమారు రూ. 2.50లక్షలు చెల్లించేలా లీజు కుదిరింది. ఈవిషయం గ్రామస్థులకు తెలిసింది. దాంతో గ్రామస్తులంతా కూటమి నేతలను ఆశ్రయించారు. పాటను రద్దు చేయించారు. పరిమళ్ల గ్రామంలో సోమవారం మళ్లీ పాట పెట్టారు. పాటలో పోటీ ఏర్పడింది. 14 ఎకరాల భూమికి రూ. 12.62 లక్షల కౌలుకు పాడుకున్నారు. ఏడాదికి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.



అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్

186 ఫిర్యాదుల స్వీకరణ

భీమవరం టౌన్, ఆగస్టు 12 : ప్రజల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని అర్జీదారుల సమస్యలను అర్జీ దారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. సోమవారం కలెక్టర్ 186 ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్‌కు అందిన విజ్ఞప్తులలో కొన్ని ఇలా ఉన్నాయి..

- గొంతేరు డ్రెయి, గుర్లచెడు డ్రెయిన్‌లలో అనధికారికంగా గరికట్లు నిర్మించడం వలన భారీ వర్షాలు వరదల కారణంగా తమ పొలాలు ముంపునకు గురి అవుతున్నాయని మొగల్తూరు మండలం కాళీపట్నం ఈస్ట్ గ్రామానికి చెందిన తణుకుల వాసు, ఇంటి చంద్రశేఖర్, తదితరు లు ఫిర్యాదు చేశారు.
- సెంట్లుగా ఉన్న తన పొలం గజాలలో పడిందని సర్వే నెంబరు మార్చి సెంట్లు లాగా ఉండేలా చేయాలని పాలకొల్లు మండలం లంకల కోడేరు గ్రామానికి చెందిన పొన్న వీరభద్రుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.
- తమ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మాణంలో సర్వ శిక్ష అభియాన్ నాడు- నేడు నిధులు పనులు ప్రారంభం కాకముందే నిధులను డ్రా చేసి సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారని నరసాపురం మండలం దర్బరేవు గ్రామానికి చెందిన కె.వి శ్రీనివాస్ కె.జయరాజు యు.చిన్న, ఏం.ధర్మారావు, తదితరులు ఫిర్యాదులో కోరారు.
- తనకు 89 సంవత్సరాలని రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో మంచానికి పరిమితమై ఉన్నానని తనకు వికలాంగుల పింఛను మంజూరు చేయాలని గణపవరం మండలం పిప్పర మట్లపాలెం గ్రామానికి చెందిన ముప్పిపడి చిట్టెమ్మ విన్నవించారు.
- భీమవరంలో మావుళ్ళమ్మ గుడి వద్ద అన్నదానం కార్యక్రమాలు నిర్వహించే చోట మోటార్ సైకిళ్లు పెట్టడం వల్ల భక్తులకు ఇబ్బంది కలుగుతుంది, ఇటీవల పట్టణంలో ద్విచక్ర వాహనం మీద వెళుతూ సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతున్నారు. ప్రమాదాలు జరుగుచున్నవి చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన కోటిపల్లి రంగ ప్రసాద్ ఫిర్యాదు చేశారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పరిశీలన

భీమవరం టౌన్, ఆగస్టు 12: భీమవరంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను భీమవరం ఇన్‌చార్జి ఆర్డీవో ఎం. అచ్యుత్ అంబరీష్ పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం భీమవరం ఆవరణలో 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని జరుగుచున్న ఏర్పాట్లను అడిగితెలుసుకున్నారు. ప్రధాన వే దిక, కుడి, ఎడమ పక్కల ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు, వారసుల కోసం ఏర్పాటు చేస్తున్న వేదికలను ఆర్డీవో పరిశీలించారు. వేదిక వద్ద జరుగుతున్న పోలీస్ కవాతు రిహార్సల్‌ను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వాహకులతో, అధికారులతో మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం సీజన్ కారణంగా వర్షాలు వచ్చే అవకాశం ఉంటుందని అందుకు తగిన విధంగా వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సీటింగ్, తాగునీటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తెలిపారు. ఏ ఇబ్బంది రాకండా ఏర్పాట్లు చేయాలన్నారు. భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఆర్.ఐ కె.రాఘవమూర్తి రాజా, వీఆర్వో యాకోబు, ఈవెంట్ ఆర్గనైజర్ శేఖర్ తదితరులు ఉన్నారు.



చలో అమరావతి

రియల్టర్ల జోష్

ఎన్నికల ముందు అమరావతిలో భారీగా పెట్టుబడులు

నరసాపురానికి చెందిన ప్రముఖ రియల్టర్ ఎన్నికల ముందు అమరావతిలో గజం రూ.20వేలు చొప్పున పెద్ద మొత్తంలో సీఆర్డీ పరిధిలో ప్లాట్‌లు కొన్నాడు. ఎన్నికల ఫలితాల్లో కూటమి అధికారంలోకి రావడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. రేటు రెట్టింపు అవ్వడంతో కోట్లల్లో లాభాలు వచ్చాయి. దీంతో చాలా అప్పుల్ని తీర్చేశాడు. స్థానికంగా ఉన్న భూముల్ని అమ్మి అక్కడ మళ్లీ కొనుగోలు చేశాడు. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక మంది రియల్టర్ల చూపు ఇపుడు అమరావతి పై పడింది.

నరసాపురం, ఆగస్టు 12: నరసాపురం నుంచి పది మంది పైనే సిండికేట్‌గా ఏర్పడి అమరావతిలో భూములపై పెట్టుబడులు పెట్టారు. భవిష్యత్‌లో మంచి లాభాలు వస్తాయన్న ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ చేయించి ఉంచేశారు. ఇలా ఒక్క నరసాపురం నుంచే కాకుండా పాలకొల్లు, భీమవరం, తణుకు, టీపీగూడెం ప్రాంతాలకు చెందిన రియల్టర్లు కూడా సిండికేట్‌గా ఏర్పడి అమరావతిలో ప్లాట్‌లు కొనుగోలు చేశారు. ఇలా నెల క్రితం కొన్నవారందరికీ మంచి లాభాలు దక్కాయి. కొందరు అమ్మితే, మరికొందరు భవిష్యత్‌లో ఇంకా పెరుగుతాయన్న ఉద్దేశంతో ఉంచేశారు. ఒక రియల్టర్లే కాకుండా కొంత మంది వైద్యులు, ప్రైవేట్ వ్యక్తులు కూడా అమరావతిలోని రైతుల వద్ద భారీగా స్థలాలు కొంటున్నారు. దీంతో స్థానిక వ్యాపారం కంటే అక్కడ పెట్టుబడులే ఎక్కువగా ఉంటున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో అత్యధికంగా నష్టపోయిన వారిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఉన్నారు. అప్పటి ప్రభుత్వ విధానాల వల్ల చాలా మంది నష్టాలను చవిచూశారు. కొన్ని వేసిన లే అవుట్‌లకు కనీసం గిట్టుబాటు కూడా దక్కలేదు. అభివృద్ధి లేకపోవడం, ఇటు కొనుగోలు చేసిన వారు కూడా నష్టపోయారు. ఎన్నికల ముందు వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. అనేక మంది అప్పుల ఊబిలో కూరుకుపోతే... మరికొందరు ఊరు వదిలి వెళ్లిపోయారు. కొందరు అమ్మలేక స్థలాలను అలాగే ఉంచేశారు.

అమరావతిపై చూపు.....

ఎన్నికల ముందే కూటమి వస్తుందని భావించిన జిల్లాలోని కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధైర్యం చేసి అమరావతిలో స్థలాలు కొన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేయడంతో అక్కడి ప్లాట్ల ధరలు అమాంతంగా పడిపోయాయి. గజం రూ.10వేలు వరకు కూడా వచ్చింది. అయితే ఎన్నికల సర్వేలన్నీ కూటమికి అనుకూలంగా ఉండటంతో ధరలు పెరగడం మొదలుపెట్టాయి. ఈసమయంలో జిల్లాలోని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను అక్కడ భూములపై పడింది. సీఆర్డీ పరిధిలో ప్రభుత్వం రైతులకు ప్లాట్‌లు చేసి ఇచ్చింది. వీటిని అమ్ముకునే సౌలభ్యం కల్పించింది. రిజిస్ట్రేషన్ ధర తక్కువగా ఉండటం, గంట లోపే రిజిస్ట్రేషన్ పత్రాలు చేతికి అందే విధానం అమల్లో ఉండటంతో అనేక మంది అక్కడ స్థలాలపై పెట్టుబడులు పెట్టారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి నిర్మాణానికి పెద్ద పీట వేయడంతో ఈ ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. దీంతో రియల్టర్లలో జోష్ నెలకొంది. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగితే గత ప్రభుత్వ హయాంలో మూటకట్టుకున్న నష్టాన్ని భర్తీ చేసుకుంటామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

‘సర్దుబాటు’ని సరిదిద్దడం ఎలా?!

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవోలతో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై టీచర్ల అభ్యంతరాలు



పశ్చిమగోదావరి జిల్లా డీఈవో నాగమణికి వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 12 : ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ తాజాగా మరోమారు ‘సాంకేతిక’ కారణాలతో సోమవారం వాయిదా పడింది. ఇలా వాయిదా పడిన ‘మిగులు’ ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ఎదురైన అడ్డంకులను అధిగమించిన తర్వాత తుది జాబితాలను ఈ నెల 16న విడుదల చేసి, ఆ మరుసటిరోజే మండలాల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ను నిర్వహించడానికి విద్యాశాఖ యోచిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది అంత సులువుగా జరిగే పరిస్థితులు కనబడడం లేదు.

గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 117 ఉత్తర్వులు మొత్తాన్నే రద్దు చేసి, అంతకు ముందువున్న జీవో 53 లేదా నూతన మార్గదర్శకాలను రూపొందించిన తర్వాతే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టాలని టీచర్లతో పాటు, దాదాపు అన్ని ఉపాధ్యాయ సంఘాలు పట్టుబడుతుండటమే ప్రతిష్టంబనకు ప్రధాన కారణాల్లో కీలకమైందిగా చెప్పవచ్చు. మరోవైపు సర్‌ప్లస్ టీచర్ల వివరాలతో కూడిన జాబితాలను ఆదివారం రాత్రి సంబంధిత ఎంఈవోల లాగిన్‌లకు పాఠశాల విద్యాశాఖ విడుదల చేయగా, వాటిలోను లోపాలున్నట్టు పలువురు టీచర్లు సోమవారం అర్జీల రూపంలో ఎంఈవోలకు సమర్పించగా, వీటిని పరిష్కరించడానికి జిల్లా విద్యాశాఖ కసరత్తు తుదిదశకు చేరింది. గుర్తించిన మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయులకు సోమవారం మధ్యాహ్నం 3గంటల నుంచి మండలాల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా కొరత వున్న పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేయగా ఆ ప్రక్రియను చేపట్టడానికి కొన్ని గంటల ముందు తాత్కాలిక నిలిపివేత/వాయిదా సమాచారాన్ని పంపారు. వాస్తవానికి ఇప్పుడు జరుగుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను జిల్లాల పరిధిలో మండలాలకే వదిలేసినట్టయితే స్థానిక అవసరాలకనుగుణంగా నిబంధనలకు లోబడి క్షేత్రస్థాయి విద్యాధికారులు సర్దుబాటును కొద్దిపాటి ఆటంకాలు తలెత్తినా పరిష్కరించి ప్రశాంతంగా పూర్తి చేసేవారని, దీనికి భిన్నంగా రాష్ట్రమంతటికీ తాత్కాలిక కాలానికి లోబడిచేసే సర్దుబాటు ప్రక్రియను ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌గా చేపట్టడం వల్ల కొంత గందరగోళానికి కారణం కావడంతో పాటు, సందిగ్ధతలకు తావు ఇచ్చినట్టయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలాచేస్తే సర్దుబాటుకు ‘సరే’ ?

వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు తాము సహకరిస్తామంటూనే పలు అభ్యంతరాలను లేవనెత్తుతున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వివిధ ప్రతిపాదనలను విద్యాశాఖ ముందుంచుతున్నారు. సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌కు అనుసరించే ప్రిఫరెన్షియల్ విధానాన్ని మండల పరిధిలోని వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు వర్తింపజేయాలని కోరుతున్నారు. ఇటీవల విద్యాశాఖ జారీచేసిన మార్గదర్శకాల్లో ప్రిఫరెన్షియల్ విధానం డివిజన్, జిల్లాస్థాయి సర్దుబాటుకే ఉందని చెబుతున్నారు. దృష్టిలోపం వున్న టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయింపు నిచ్చినట్టే శారీరక వైకల్యం వున్న ఉపాధ్యాయులకు ఇవ్వాలని డిమాండ్ వస్తోంది. ఇక మండలస్థాయి కౌన్సెలింగ్‌లో తొలుత స్థానికంగా కొరతవున్న హైస్కూళ్లు, ఆ తదుపరి ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయాలని ఇపుడున్న మార్గదర్శకాలు స్పష్టం చేస్తుండగా, దీనిని పూర్తిగా మార్చివేసి మండలంలో టీచర్ల కొరత వున్న ఏ పాఠశాలనైనా తమకు నచ్చినట్టుగా కోరుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు టీచర్లు షరతు పెడుతున్నారు.



దేవుని ఫొటోలకు పూజలు, అక్కడున్న ఓ రాయికి పసుపు కుంకుమలు అద్దిన దృశ్యం

గుప్త నిధుల కోసం
తవ్వకాలు

- ద్వారకాతిరుమలలో కలకలం
- గోతులు తీసిన ఆనవాలు, దేవుని ఫొటోలకు పూజలు
- భయాందోళనలో స్థానికులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 12: ద్వారకాతిరుమల కుచ్చెలమెట్టపై గుప్తనిధుల కోసం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ జరుపుతున్న తవ్వకాలు కలకలాన్ని రేపుతున్నాయి. వారం రోజులుగా రెండు రోజులకోసారి ఇలా తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. నృశింహసాగరం సమీపంలో నిర్మానుష్యంగా ఉండే కుచ్చెల మెట్టపై రాత్రివేళ లైట్లు వేసుకుని..... పలుగులతో తవ్వకాలు జరిపే శబ్దాలు విని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ కుచ్చలమెట్టపై పురాతన మండపం ఉండేదని, క్షీరాబ్దిద్వాదశి పర్వదినాన తెప్పోత్సవం నిమిత్తం సాగరం వద్దకు వచ్చే స్వామి, అమ్మవార్లు ముందుగా ఈ మండపం వద్దకు వెళ్లే వారని పెద్దలు చెబుతున్నారు. అయితే ఈ మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ మెట్టపైకి ఎవరూ వెళ్లలేదని వారు అంటున్నారు. అయితే గతంలో కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేవారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరలా తాజాగా వారం రోజుల నుంచి ఈ ప్రాంతంలో జరుపుతున్న తవ్వకాలు ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఈక్రమంలో కొందరు గ్రామస్థులు సోమవారం అక్కడకు వెళ్లి పరిశీలించగా ఆ ప్రాంతంలో పలు చోట్ల రాళ్లకు పసుపు, కుంకుమలు, దేవుని ఫొటోలను ఉంచి పూజలు చేయడంతో పాటు పెద్ద గొయ్యి తీసిన ఆనవాలు ఉందని.. అటుగా వెళ్లాలంటేనే భయమేస్తోందని వారు అంటున్నారు. గుప్త నిధుల తవ్వకాలు జరుపుతున్న వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

17న సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర రైలు

ఏలూరు క్రైం, ఆగస్టు 12 : సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర రైలు ఈ నెల 17న విజయవాడ నుంచి బయలు దేరుతుందని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అన్ టూరిజయం కార్పొరేషన్ లిమిటెడ్ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. ఈ రైలు ఉజ్జయిని (మహాకాళేశ్వర అండ్ ఓం కారేశ్వర్), ద్వారక (నాగేశ్వర), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వరుడు), ఔరంగాబాద్ (గ్రిష్ణేశ్వర్) ప్రాంతాల దర్శన యాత్రగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రైలు 28వ తేదీ వరకూ 11 రాత్రులు, 12 పగలు యాత్ర ఉంటుందన్నారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్ మీదుగా ఈ రైలు వెళ్తుందన్నారు. స్లీపర్‌లో పెద్దలకు రూ.20,590, పిల్లలకు రూ.19,255, త్రీటైర్ ఏసీ పెద్దలకు రూ.33,015, పిల్లలకు రూ.31,445, సెకండ్ ఏసీ పెద్దలకు రూ.43,355, పిల్లలకు రూ.41,465లు టికెట్ ధర ఉంటుందన్నారు. బుకింగ్ కోసం 92810 30714 లేదా 92814 95848లో సంప్రదించాలని సూచించారు.

తూర్పుగోదావరిలో ఇసుక వివరాలు ఇవే

భీమవరంటౌన్, ఆగస్టు12 : తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల వారిగా స్టాక్ పాయింట్లు వద్ద సోమవారం నాటికి ఇసుక లభ్యత వివరాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో 10,243 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో 15,300 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 40,420 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్ను రూ.270 అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు-1లో 2,686 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 3,260 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని, టన్ను రూ.265లు చెల్లించి ఇసుకను ఉచితంగా పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ఏలూరు రూరల్, ఆగస్టు 12: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాల పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఏపీ ఎస్ఐఆర్‌డీ ఆధ్వర్యంలో ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా పొందాలంటే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీతో పాటు ఆయా పనులకు నిధులు కేటాయింపు, నిబంధనల ప్రకారం ఖర్చు చేయటం ముఖ్యమన్నారు. ఏలూరు ఎంపీడీవో బండి ప్రణవి, ఈవోపీఆర్డీ సరళకుమారి, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ నిరసన

ఇరగవరం, ఆగస్టు 12: ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారంటూ సోమవారం విద్యార్థి సంఘం నిరసన తెలిపింది. రేలంగి జడ్పీ హైస్కూలు కొందరు ఉపాధ్యాయులు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ పాఠశాల వద్ద విద్యార్థి సంఘం బైఠాయించి నిరసన తెలిపింది. సమాచారం అందుకున్న ఎంఈవో వరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘ నాయకులతో మాట్లాడి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డీవైఈవో మురళీ సత్యనారాయణ పాఠశాలకు వచ్చి బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను వివరణ కోరగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించ లేదని కొంతమంది విద్యార్థి సంఘ నాయకులే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

గిరిజనుల చేతిలో
కొండచిలువ హతం



జీలుగుమిల్లి, ఆగస్టు 12 : రమణక్కపేట అటవీ ప్రాంతంలో స్థానిక గిరిజనులు కొండ చిలువను హతమార్చారు. గ్రామానికి చెందిన కొందరు అడవిలోకి గొర్రెలు, మేకల్ని పశువుల్ని మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో పది అడుగుల కొండచిలువ మేకల వద్దకు రాగా పసిగట్టిన కాపరులు దానిని గుర్తించి హతమార్చారు. తాము అదమరిస్తే మేక పిల్లల్ని చుట్టి చంపి తినేందుకు ప్రత్నిస్తుందన్నారు.

48 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు సిటీ, ఆగస్టు 12 : రానును ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోనే సొమ్ము జమ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. స్థానిక సర్‌సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రైతులకు ధాన్యం కొనుగోలు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 35,374 మంది రైతులకు ధాన్యం సొమ్ము రూ.674.43 కోట్లు చెల్లింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాగానే రూ.వెయ్యి కోట్ల బకాయిలు చెల్లించిందని, మిగిలిన రూ.674 కోట్లు ఈ రోజు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయటం జరిగిందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే రూ.472 కోట్ల ధాన్యం బకాయిల సొమ్మును రైతులకు చెల్లిస్తున్నామని ఆయన చెప్పారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేస్తామన్నారు. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వం ఉచితంగా చెల్లించే యోచన ఉందన్నారు. గత ప్రభుత్వం రైతులను అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కనీసం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలో ఎమ్మెల్యేలు రైతుల సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 16 నుంచి నిర్వహించే గ్రామసభల్లో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేస్తామన్నారు. వరి పండించే రైతులు ఈ-పంట ద్వారా రైతు సహాయక కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వేర్‌హౌస్ గోదాములు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గత రబీలో రెండు లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 17,496 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. అయితే రైతులకు సుమారు రూ.200 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తదుపరి తొలుత రూ. 153 కోట్లు చెల్లించటం జరిగిందన్నారు. ఈ రోజు రూ. 47.53 కోట్ల 2,116 మంది రైతుల వ్యక్తిగత ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ గత రబీలో 12.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకోవటం జరిగిందన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ గిట్టుబాటు ధర కల్పించే దిశగా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కైకలూరు, తాడేపల్లిగూడెం, దెందులూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బొలిశెట్టి శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. కౌలు రైతులకు సకాలంలో సొమ్ము బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్‌కుమార్, సిరి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి , ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పౌరసరఫరాల శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు

ధాన్యం బకాయిలకు సంబంధించి రైతులకు చెక్కులు పంపిణీ చేయటానికి ఏలూరు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. డీలర్లకు న్యాయం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారని రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, ఉదయేశ్వరరావు, మాణిక్యాలరావు, ప్రసాద్, వీర్రాజు, దుర్గారావు, డేనియల్‌రాజు, రాజకుమార్ , రాజేశ్వరి పాల్గొన్నారు.

కుల వివక్ష నిర్మూలనతోనే అభివృద్ధి : ఎమ్మెల్సీ ఇళ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

భీమవరం అర్బన్, ఆగస్టు 12 : కుల వివక్ష నిర్మూలనతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర శిక్షణ తరగతులు సోమవారం భీమవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ప్రారంభమయ్యాయి. ఆత్మగౌరవం సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో కూడిన నీలి పతకాన్ని కేవీపీఎస్ సీనియర్ నాయకులు దిగుపాటి రాజగోపాల్ ఆవిష్కరించారు. పాలకులు కులాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణపై అనుకుల, ప్రతికూల వాదనలు చేసేవారు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కోసం ఎందుకు అడగరు అని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి గిరిజన సంఘం రాష్ట్ర నేత మంతెన సీతారాం, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం, మహిళ నాయకులు విజయఅరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, సీఐటీయూ నాయకులు జేఎన్‌వీ గోపాలన్, వాసుదేవరావు, బత్తుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన భీమవరంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌ను సందర్శించారు.

నవోదయలో రీజనల్ క్రికెట్ ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి

పెదవేగి, ఆగస్టు 12 : ఏలూరు జిల్లా పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో రీజనల్ క్రికెట్ ఎంపిక పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎంపిక పోటీలను నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లోని జవహర్ నవోదయ విద్యాలయాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలలోని నవోదయ విద్యాలయాలకు చెందిన 198 మంది బాలురు, 20 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారని పెదవేగి నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్‌తో ఎంపిక పోటీలను ప్రారంభించారు. అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొత్తం మూడు విభాగాల్లో క్రికెట్ జట్ల ఎంపిక ఉంటుందని సీతాలక్ష్మి తెలిపారు. 14, 17, 19 ఏళ్ళ విభాగాల్లో పోటీలు నిర్వహించి, జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ రీజియన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె వివరించారు. తొలిరోజు సోమవారం ఎన్‌సీఏ కోచ్ సత్యమూర్తి పర్యవేక్షణలో, నవోదయ విద్యాలయం పీఈటీ కె.కృష్ణ ఎంపిక పోటీలు నిర్వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువకుడి దారుణ హత్య



మృతి చెందిన నిఖిల్

ఉండి ఆగస్టు 12: చిన్ననాటి స్నేహితుల మధ్య వచ్చిన బేధాభిప్రాయాలు హత్యకు దారితీశాయి. ఐదుగురు యువకులు హత్యచేసి ఏమి తెలియనట్లు ఉండి గోరింతోటకు సమీపంలోని రైల్వేట్రాక్‌పై వేసి రైలు ప్రమాదంగా చిత్రీకరించేందుకు వారు వేసిన పన్నాగం బెడికొట్టింది. ఈ కేసుకు సంబంధించి ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు ఉండి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం గునుపూడి కందికట్లవారి వీధికి చెందిన నల్లగంగుల నిఖిల్(25)ది స్వగ్రామం కాళ్ల మండలం వేంపాడు. భీమవరంలోని సీఫుడ్ ట్రేడింగ్ కంపెనీలో ఇనస్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. నిఖిల్ గ్రామానికి చెందిన పవన్ కుమార్ చిన్ననాటి స్నేహితులు. ఈ మధ్య వీరికి మనస్పర్ధలు చోటు చేస్తున్నాయి. దాంతో పవన్‌కుమార్ తరుచు నిఖిల్‌తో నిన్ను చంపేస్తానంటూ బెదిరించేవాడని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపధ్యంలో ఈ నెల 11న మృతుడు నిఖిల్‌తో ముద్దాయి పవన్‌కుమార్ కలిసి మాట్లాడు కోవడం తాను చూసినట్లు మృతుని తండ్రి ఎలీషారావు పోలీసుల కు తెలిపారు. అదే రోజు రాత్రి 9.11 గంటల మధ్య ముల్లంకి పవన్ కుమార్, మారేష్‌తో పాటు ఉండి గోరింతోటలకు చెందిన మరో ముగ్గురు యువకులతో కలిసి నిఖిల్‌ని హత్యచేసి రైల్వే ట్రాక్‌పై వేసి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించడానికి ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. కాగా గంజాయి మత్తులో గొడవ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. తన కుమారుడు నిఖిల్‌ను అన్యాయంగా హత్యచేసి పొట్టన పెట్టుకున్నారంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తన కుమారుని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మృతుని కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు. నిఖిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

మామ మృత దేహానికి
తలకొరివి పెట్టిన కోడలు



ఏలూరు క్రైం, ఆగస్టు 12 : ఆయన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి. ఆయన కుమారుడు ఎనిమిది సంవత్సరాల క్రితం అనా రోగ్యంతో మృతి చెందాడు. ఉన్న ఏకైక కుమారుడు మరణించడంతో కోడలే కొడుకు అవతారం ఎత్తింది. ఆమె మామ మరణించడంతో తలకొరివి పెట్టింది. ఈ సంఘటన సోమవారం ఏలూరులో జరిగింది. ఏలూరు తూర్పువీధికి చెందిన యర్రంశెట్టి నరసింహారావు (75) వ్యవసాయ శాఖలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య నాగమణి, కుమారుడు గౌరీ శంకర్ కుమార్, కోడలు భవానీ ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం కుమారుడైన గౌరీ శంకర్ అనారోగ్యంతో మరణించాడు. యర్రంశెట్టి నరసింహారావు అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఆయన కోడలు భవానీయే తలకొరివి పెట్టడానికి అన్ని ఏర్పాట్లు బంధువులు చేశారు. దీంతో ఏలూరు తూర్పు వీధి నుంచి మృతదేహాన్ని సుంకరవారి తోటలో ఉన్న హిందూ శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. భవానీతో మామ మృత దేహానికి తలకొరివి పెట్టించారు.



148 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

దెందులూరు, అగస్టు 12 : గ్రామంలో ఆగస్టు 15 వేడుకలు పురస్కరించుకుని విజయ నగేష్ డీఈడీ నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు 148 అడుగుల జాతీయ జెండాతో భారీ ప్రదర్శన నిర్వహించారు. నర్సింగ్ కాలేజీలో 148 అడుగుల భారీ జాతీయ జెండాను తయారు చేయించి నర్సింగ్, డీఈడీ కాలేజీ విద్యార్థులతో జాతీయ జెండా ప్రమఖ్యతను తెలుపుతూ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వారిని స్మరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు



ఏలూరు క్రైం, ఆగస్టు 12 : విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయి తీసుకువచ్చి ఏలూరు నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వాటిని కొనుగోలు చేసి తిరిగి అమ్మేవారిని గంజాయిని తాగే వారిని మొత్తం ఏడుగురిని ఎస్ఈబీ అధికారులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్ఈబీ అధికారులు కలసి సోమవారం రాత్రి ఏలూరు సమీపంలోని కలపరు టోల్ గెట్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులో తీసుకుని, తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 20 కేజీల 30 గ్రాముల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన నమ్మి హరికృష్ణ ప్రస్తుతం ఏలూరు గణేష్ నగర్‌లో ఉంటూ, అతని స్నేహితుడైన ఏలూరు వంగాయ గూడెం ప్రాంతానికి చెందిన వడలి నరసింహ శ్రీనివాస్‌తో కలిసి విశాఖ ఏజె న్సీ చింతపల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చినట్టుగా పోలీ సులు గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో ఏలూరుకు చెందిన కొమ్మిన మణికంఠ, నంబూరి బాలు, వెలగల నాగ శివ గణేష్, రాజా జై రామ్, సంగ్రాణి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు సూర్య చంద్రరావు తెలిపారు.

కోళ్ళ వ్యర్థాల లారీలు సీజ్

భీమడోలు, ఆగస్టు 12 : కోళ్ళ వ్యర్థాలను చేపల చెరువుల్లో వినియోగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. భీమడోలు మండలం పెదలింగంపాడులో సోమవారం ఘంటా మోహన రావు, లంక నాని, అనే ఇద్దరు వ్యక్తులు నిర్వహిస్తున్న చేపల చెరువులకు మూడు లారీలలో కోడి వ్యర్థాలను తరలిస్తున్నారనే సమాచారంతో భీమడోలు తహసీల్దార్‌ను కలెక్టర్ అప్రమత్తం చేసి లారీలను సీజ్ చేసి వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు భీమడోలు రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ అధికారులతో కూడిన మండల టీమ్ దాడి చేసి భీమడోలు రైల్వే గేటు సమీపంలో ఉండి గ్రామానికి వెళ్తున్న కోడి వ్యర్థాల లారీలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశారు. కోడివ్యర్థాలను భీమడోలు డంపింగ్ యార్డులో పూడ్చిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

పేకాట రాయుళ్ళ అరెస్టు

కామవరపుకోట, ఆగస్టు 12 : మండలంలోని వడ్లపల్లిలోని తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.6,950 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తడికలపూడి ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

పెంటపాడు, ఆగస్టు 12 : స్నానానికి వెళ్ళిన వ్యక్తి ప్రమాదపు శాత్తు కాలువలో జారి కాలువలో పడి మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రత్తిపాడులో వెల్డింగ్ పని చేసే ముప్పిడి శంకర్‌ప్రసాద్ (36) ఆదివారం రాత్రి గ్రామంలోని ఏలూరు కాలువ వద్ద స్నానానికి వెళ్ళిన ప్రమాదపుశాత్తు జారి కాలువలో పడ్డాడు. సోమవారం ఉదయం ఇతని మృతదేహం ఏలూరు కాలువలో ప్రత్తిపాడు పైటవర్ సమీపంలో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య పద్మలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ శీలం శంకర్ కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు కాలుజారి..



మృతి చెందిన సుబ్రహ్మణ్యం

భీమడోలు, ఆగస్టు 12 : ప్రమాదవశాత్తు కాలుజారి ఏలూరు-గోదావరి కాలువలో వ్యక్తి పడి మృతి చెందిన ఘటన భీమడోలులో జరిగింది. గ్రామానికి చెందిన పిల్లి సుబ్రహ్మణ్యం (43) సోమవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి గల్లంతు కాగా భీమడోలు అగ్నిమాపక అధికారులు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. అగ్నిమాపక అధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 11: గోతుల రోడ్డు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తాడేపల్లిగూడెంలోని తణుకు రోడ్డులో గోతుల రోడ్డును తప్పించేందుకు రాంగ్ రూట్‌లో వెళ్లిన ఆర్టీసీ బస్సు ఓ మోటారుసైక్లిస్టును ఢీకొన్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. తణుకు నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు గోతులు ఉన్నాయని రాంగ్ రూట్‌లోకి వచ్చింది. దీంతో ఎదురుగా వస్తున్న మోటారు సైక్లిస్ట్ షేక్ బాజి (45) ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే టైం పడుతుందనడంతో ఢీకొన్న ఆర్టీసీ బస్సులోనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాజి మృతి చెందినట్టు నిర్ధారించారు. బాజికి కుమార్తె, కుమారుడు, ఉన్నారు. బాజి తాపీ పనిచేస్తు జీవనం సాగిస్తుంటాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మోటారు సైకిల్ అదుపుతప్పి..

తణుకు, ఆగస్టు12 : మోటారు సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి ఉండ్రాజవరం జంక్షన్ వద్ద జరిగింది. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద వంతెన పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్ళింపునకు రోడ్డుకు అడ్డంగా తాడు కట్టారు. ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామానికి చెందిన గంగులకుర్తి పూర్ణ చంద్రసాయి కుమార్(22) అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు గురై..

ద్వారకాతిరుమల, ఆగస్టు 12: పొలంలో ఆవులను మేపుతుండగా పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పంగిడిగూడెంకు చెందిన మట్టా కనకరాజు(63) సోమవారం ఉదయం ఆవులను మేపుతున్నాడు. ఇదే సమయంలో పాము కరవడంతో నురగ కక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన అతడ్ని పరిసర ప్రాంత రైతులు గుర్తించి అతని కుమారుడు వేణుగోపాలరావుకు తెలియపర్చారు. స్థానిక వైద్యులకు చూపించగా అప్పటికే మృతి చెందాడని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏలూరు క్రైం, ఆగస్టు 12 : ఒక గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ తూలిపోతూ పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఏలూరు గూడ్స్ షెడ్ రోడ్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి (30) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళి ఒక మెకానిక్ షాపు ముందు పడిపోయాడు. ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు టూ టౌన్ పోలీసులకు అందించడంతో సీఐ ఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనా బాషా తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 08812-230652కు సమాచారం అందించాలని కోరారు.

వ్యక్తి మృత దేహం లభ్యం

ఉంగుటూరు, ఆగస్టు 12 : మండలంలోని గోపీనాథపట్నం గ్రామంలోని చెరువులో సుమారు 60 సంవత్సరాల వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ఈ మృత దేహం కుళ్ళిన స్థితిలో ఉంది. బుజ్జి అనే వ్యక్తికి చెందిన చెరువులో లభ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు.

శ్రీలక్ష్మీ ఫైర్ వర్క్స్ షాపులో అగ్నిప్రమాదం

పెనుమంట్ర, ఆగస్టు 12 : మండలంలోని ఆలమూరులో ఉన్న శ్రీలక్ష్మీ ఫైర్ వర్క్స్ హోల్ సేల్ షాప్‌లో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. షాపులో నుంచి దట్టమైన పొగ, మంటలు వస్తుండడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు అగ్నిమాప సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పాలకొల్లు అత్తిలి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలో ఉన్న చెరువులోని నీటితో సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. పెనుగొండ సర్కిల్ ఇనస్పెక్టర్, పెనుమంట్ర ఎస్ఐ, నరసాపురం డీఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఫైర్ సెక్యూరిటీ వాల్స్ ఓపెన్ కావడంతోనే మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు అంచనా వేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

బంగారం, వెండి చోరీ

ఆకివీడు, ఆగస్టు 12 : తొమ్మిది కాసుల బంగారం, 400 గ్రాముల వెండి చోరీకి గురైనట్లు గుగ్గిల హసిత ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక శ్రీరామపురానికి చెందిన గుగ్గిల రవితేజ, హసిత గత నెలలో ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళారు. ఆదివారం ఆకివీడులో పెళ్ళికి బంధువులు వచ్చి శ్రీరామపురం ఇంటికి వెళ్ళగా తాళం పగలుకొట్టి, బీరువాలో బట్టలు చెల్లాచెదురు కావడంతో రవితేజకు తెలియ చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఇంటి యజమానులు వచ్చి పరిశీలించి బంగారం, వెండి చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

హైవేపై అదుపు తప్పిన లారీ

సబ్బవరం, ఆగస్టు 12 : జాతీయ రహదారి సబ్బవరం పెదనాయుడుపాలెం వద్ద సోమవారం ఉదయం చేపల లోడుతో ఉన్న లారీ అదుపు తప్పి ఆగి ఉన్న మరో లారీని ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైవే మొబైల్ ఏఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తాడిపల్లిగూడెం నుంచి చేపల లోడుతో ఓ లారీ అసోం రాష్ట్రం గౌహతికి బయలుదేరింది. జాతీయ రహదారి పెదనాయుడుపాలెం వద్ద ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేసి ఆగి ఉన్న మరో క్వారీ లారీని ఢీకొంది. దీంతో క్వారీ లారీ బోల్తా పడింది. చేపల లోడ్‌తో ఉన్న లారీ కేబిన్ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. హైవే మొబైల్ పోలీసులు అతికష్టమ్మీద అతనిని బయటకు తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో లారీని పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 12 :ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ నాగరాణి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం భీమవరం విష్ణు కళాశాల ఆడిటోరియంలో జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో 'నష ముక్త్ భారత్ అభియాన్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు సమావేశాలు నిర్వహించి యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడంలో కృషి చేయాలన్నారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ మత్తు పదార్థాల కేసుల్లో బుక్ అయితే కోర్టుల చుట్టూ తిరగడం చాలా ఖర్చుతో కూడిన పని అన్నారు. కళాశాల విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం అంటూ సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, సెబ్ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఈవో నాగమణి, ప్రిన్సిపాల్ ఐఆర్కే రాజు, ఎం.వేణు, విద్య, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఆకివీడు రూరల్ : మాదక ద్రవ్యాలను అరికడదామని మండలంలోని సచివాలయాలలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కుప్పనపూడిలో సర్పంచ్ ముత్యాల అనురాధ, పీఎస్పీ ఆనంద్ భూషణం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.
- నరసాపురం టౌన్ : విద్యార్థులు డ్రగ్స్, మద్యం వంటి చెడు వ్యసనాలకు బానిసకావద్దని ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కో-ఆర్డినేటర్ జేసు ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం సూర్య కళాశాల విద్యార్థులకు ఆరోగ్య స్థితి, డ్రగ్స్, ఎయి డ్స్ వంటి వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కరస్పాండెంట్ బ్రహ్మాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

24న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

భీమవరంటౌన్, ఆగస్టు 12 : పోషకాహార లోపం, రక్తహీనత, అలసట నుంచి దూరంగా ఉంచేందుకు పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను ఇప్పించాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 24 జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లాలో పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వర రావు మాత్రలను ఎలా వినియోగించాలో వివరించారు.

సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలి

నగదు ఆదా అయ్యే సోలార్ విద్యుత్‌ను ప్రతి ఇంటిపై ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో ఆమె విద్యుత్ అధికారులు, సోలార్ వెండర్స్‌తో సమావేశమై ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటుతో పర్యావరణానికి మంచి జరుగుతుందన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. మొబైల్ నంబరు ద్వారా లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్, డీఈఈ రాజగోపాల్ చౌదరి పాల్గొన్నారు.

'బాల్య మిత్ర ట్రస్టు సేవలు మరువలేనివి'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఆచంట, ఆగస్టు 12 : గత ముప్పైఐదు ఏళ్లుగా వల్లూరు హైస్కూలు అభివృద్ధికి గ్రామానికి చెందిన బాల్య మిత్ర సేవా ట్రస్టు చేస్తున్న సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం స్థానిక హైస్కూలులో బాల్య మిత్ర సేవా ట్రస్టు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తల్లిదండ్రులు లేని సుమారు పది మంది అనాథ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, షీల్డ్ అందజేశారు. పాఠశాలకు మైక్ సెట్ ఏర్పాటుకు రూ. 25 వేల నగదు, పాఠశాల ఖర్చులకు మరో రూ.10 వేలు అందజేశారు. ట్రస్టు చైర్మన్ గుబ్బల శివరామకృష్ణ, పుల్లి రామదాసు, గెద్దాడ ప్రసాద్, ఎస్. మన్మథరావు, బండి రత్నంరాజు, ఏడిద వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఉండి, ఆగస్టు 12:ఉండి యానాదుల కాలనీలో మహిళలను కులం పేరుతూ దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనా భీమారావు డిమాండ్ చేశారు. యానాదుల కాలనీలో రోడ్డు పక్కన 40 ఏల్ల క్రితం ఇళ్లు వేసుకుని నివాసం వుంటున్న ఎస్టీ యానాదుల ఇళ్లను తొలగించాలని దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఉండి తహీల్దారు కారార్యాలయం వద్ద సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. సీపీఐ నాయకులు సీతారామ ప్రసాద్, పతివాడ గణపతి, సనపల శ్రీనివాస్, దొమ్మేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ఆకివీడు రూరల్/నరసాపురం టౌన్, ఆగస్టు 12 : దుంపగడప వీవీగిరి ప్రభుత్వ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఓగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నరసాపురం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో రిటైర్డ్ శాస్త్ర వేత్త రంగినీడి సుబ్బారావు ఆధ్వర్యంలో గణిత శాస్త్రజ్ఞుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి నిర్వహించారు. లైబ్రరీ అధికారి కుమారి, సుదీర్‌మోహన్, సూర్యంబాబు, హెచ్ఎం నాగలక్ష్మి, జీవన్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

వృద్ధులను సంతోషంగా ఉంచాలి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 12 : వృద్ధులను గౌరవించి వారిని సంతోషంగా ఉంచినప్పుడు సమాజం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగా నరసింహారావు అన్నారు. స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శోభారాణి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొండా నిర్మల మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ బాలకోటయ్య, తిరుపతిరాజు, మూర్తి, శర్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ మండల వీఆర్ఏల కమిటీ ఏకగ్రీవం

పెనుగొండ, ఆగస్టు12 : వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర వీఆర్‌వోల సంఘం ప్రధాన కార్యదర్శి బుంగ గణేష్‌రావు అన్నారు. సోమవారం పెనుగొండలో వీఆర్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల వీఆర్ఏల అధ్యక్షుడిగా వి.పాపారావు, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటరావు, మండల సెక్రటరీగా బి.దుర్గాప్రసాదరావు, కోశాధికారిగా రవికుమార్, గౌరవాధ్యక్షుడుగా టి.భాస్కరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఆకివీడు** : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో వై.రామకృష్ణ సోమవారం తెలిపారు.
- **ఆకివీడు** : ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణను పామర్రు బదిలీ చేశారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రామకృష్ణను ఎంపీపీ కఠారి జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, గ్రామాల సర్పంచులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- **ఆచంట** : ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ మృతి పట్ల సోమవారం పితానిని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, వైస్‌ఎంపీపీ తాళం శ్రీనివాస్ , కరుగోరుమిల్లి సర్పంచ్ అల్లం పద్మావతి, వల్లూరు ఎంపీటీసీ ఆరిమిల్లి సుబ్బారావు పరామర్శించారు.
- **పాలకొల్లు రూరల్**: పాలకొల్లు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మట్టపర్తి అనుపమ తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం గ్రామ కార్యదర్శులు, కార్యలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.
- **పాలకొల్లు అర్బన్** : తహసీల్దార్‌గా ఇటీవల బదిలీపై పెడన నుంచి వచ్చిన యడ్ల దుర్గాకిషోర్‌ను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పట్టణ తూర్పు కాపు సంఘ నాయకులు కలిసి పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.
- **ఆకివీడురూరల్** : ఆకివీడు-చినిమిల్లిపాడు రహదారిలో కళింగపాలెం వద్ద అధ్వానంగా ఉన్న రహదారిని ఎమ్మెల్యే రఘురామ ఆదేశాల మేరకు బాగు చేస్తున్నట్లు టీడీపీ నాయకుడు పూజారి వరప్రసాదు తెలిపారు.

అసంబద్ధ 'పని సర్దుబాటు' కుదరదు

» ఉపాధ్యాయ సంఘాల నిరసన

కాళ్ళ, ఆగస్టు 12 :ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల సూచనలు, వినతులను పట్టించుకోకుండా అసంబద్ధంగా చేయతలపెట్టిన 'వర్క్ అడ్జస్ట్మెంట్‌ను ఫ్యాప్టో కాళ్ళ మండల పక్షాన బహిష్కరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కి లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశామని సంఘ నాయకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 117 జీవో రద్దు చేస్తామని, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూస్తామని హామీలు ఇచ్చిన ఈ ప్రభుత్వం ప్రస్తుతం అసంబద్ధంగా పని సర్దుబాటు చేయడం తగదన్నారు. ఈ సర్దుబాటు మండల స్థాయిలో జరగడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. ప్రతీ నెలలోనూ ప్రమోషన్ ఇవ్వడం ద్వారా ఉన్నత పాఠశాలలో సబ్జెక్ట్ కొరతను తీర్చవచ్చని చెప్పారు. యూటీఎఫ్ నుంచి పట్టాభి రామయ్య, రామకృష్ణంరాజు, స్వామి, ఎస్టీయూ నుంచి పాపారావు, వెంకీనాయుడు, పీఆర్‌టీయూ నుంచి కలికి మూర్తి, ఎన్‌టీఏ నుంచి సురేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు జీవో 53 ప్రకారం చేయాలి

నరసాపురం రూరల్ :పని సర్దుబాటు ప్రక్రియ జీవో 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన జీవో నంబరు 53 ప్రకారం తీసుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సోమవారం పని సర్దుబాట్ల కౌన్సెలింగ్‌ను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు బాయ్‌కాట్ చేశారు. అనంతరం ఎంఈవో పుష్పరాజ్యంకు వినతిపత్రం అందించారు. మార్కండేయులు, ఆజయ్ తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



నరసాపురంలో ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న టీచర్లు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి : కలెక్టర్

భీమవరంటౌన్, ఆగస్టు 12 :దేశం గర్వించేలా 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతిఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను రెపరెపలాడించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలో శ్రీవిజ్ఞాన వేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జెండా ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ నుంచి ప్రారంభమైన 240 మీటర్ల జాతీయ జెండాతో చేపట్టిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. డీఈవో నాగమణి, మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, చెరుకువాడ రంగసాయి, కంటేటి వెంకటరాజు, అధ్యక్షుడు నరిపిడకల రామారావు, ఆదిత్య స్కూల్, చినరంగనిపాలెం హైస్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలో గత 40 ఏళ్లుగా దేశభక్తి కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవకే జీవితాన్ని అంకితం చేసిన సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి అని కలెక్టర్ నాగరాణి అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో హరఘర్ తిరంగ్ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ నాగరాణి సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని సత్కరించి అభినందించారు

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

కాళ్ళ : బీజేపీ ఆధ్వర్యంలో కాళ్ళలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. కాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టి సుమారు 200 మీటర్ల భారీ జాతీయ జెండాతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్‌రాజు, ర్యాలీ జిల్లా ఇన్‌చార్జి కోమటి రవికుమార్, బీజేపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి, కె.వినోద్‌వర్మ, బండారు సోమేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



240 మీటర్ల జెండా ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

- నరసాపురం టౌన్ : పట్టణంలోని బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. టేలర్‌పేటలోని మహాత్మ గాంధీ, ప్రకాశం, పొట్టి శ్రీరాములు విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ కన్వీనర్ మేకల సతీష్, పీవీఆర్, మునికోటి వెంకటేశ్వరావు, విశ్వప్రతాప్, రవికిరణ్, సత్యభరత్, కంచర్ల నాగేశ్వరరావు, సంగాని వెంకటేశ్వరావు, బుజ్జి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటి మీద జాతీయపతాకం ఎగరాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ అన్నారు. పట్టణంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు.
- పాలకొల్లు : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఘర్‌తిరంగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

స్కూలు స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వీపర్ల ఆందోళన

పెనుగొండ, ఆగస్టు 12 : నాలుగు నెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ స్వీపర్లకు వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద స్కూల్ స్వీపర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.అనిత కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం నుంచి వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు 2020 సంవత్సరం నుంచి వేతనాలలో పెరుగుదల లేదని, మండల పాఠశాలల్లో మొత్తం 66 మంది ఆయాలు పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం కలుగజేసుకుని తక్షణం వారికి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుమంట్రలో దూరవిద్యపై అవగాహన ర్యాలీ

పెనుమంట్ర, ఆగస్టు 12 : దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నామని పెనుమంట్ర ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం పెనుమంట్రలో దూరవిద్యపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు ఆయన మాట్లాడుతూ పద్నాలుగేళ్లు నిండిన వారు పదో తరగతి పరీక్షలకు అడ్మిషన్లు పొందవచ్చని, ఇంటర్ అడ్మిషన్ పొందే అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధించాలన్నారు. అడ్మిషన్లు తీసుకునేందుకు ఈనెల 31 తేదీ వరకు గడువు ఉందని పెనుమంట్ర హైస్కూల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. తహసీల్దార్ వై.రవికుమార్, హెచ్ఎం డి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో శాంతి కోసం హోమాలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 12 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణ కాండకు నిరసనగా, అక్కడ శాంతి నెలకొనాలని కోరుతూ స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో గాయత్రి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వామికి ఏకవార రుద్రాభిషేకాలు, శాంతి హోమాలను నిర్వహించారు. సంఘ నాయకులు తనికెళ్ళ శ్రీనివాస్, మద్దూరి సూరిబాబు, ములుకుట్ల రవీంద్ర, మునునూరి ఫణి, ఆనంద్, గరిమెళ్ళ రాంబాబు, పెండ్యాల రామారావు, ఈరంకి కాశీ, శివకోటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యనమదుర్రులో 'నీటి పిల్లుల' సందడి



భీమవరంటౌన్, ఆగస్టు 12 : ఎప్పుడూ కాలుష్యంతో నిండి ఉండే భీమవరంలోని యనమదుర్రు డ్రెయిన్ ఇటీవల వర్షాలు కురవడంతో వరదనీరుతో రంగు మారడంతో ఎక్కడినుంచి వచ్చాయో తెలియదు కానీ సోమవారం ఫుట్‌పాత్ వంతెన సమీపంలో సుమారు ఆరు నీటి పిల్లులు గట్టు వద్దకు వచ్చి మళ్లీ నీటిలోకి దూకటం కొద్ది దూరంలో పైకి రావడం వంటివి పట్టణ వాసులు తిలకించారు.

ఆధ్యాత్మికం

మావుళ్ళమ్మ ఆలయంలో పారాయణం



లలిత పారాయణ చేస్తున్న మహిళలు

భీమవరంటౌన్, ఆగస్టు 12 : శ్రావణమాసం పురస్కరించుకుని కాళ్ళ మండలం బొండాడకు చెందిన పార్వతీ సమేత భోగేశ్వరస్వామి, రాజ్యలక్ష్మీ సమేత జనార్దన స్వామి ఆలయం పారాయణం బృందం సభ్యులు సోమవారంనాడు మావుళ్ళమ్మ ఆలయం వద్ద లలితా సహస్రనామ పారాయణం చేశారు. బొండాడ ఆలయ చైర్మన్ కె.సూర్యనారాయణ పర్యవేక్షణలో 60 మంది మహిళలు ఏకరూప దుస్తులతో పారాయణ నిర్వహించడం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వహించారు. దేవస్థానం తరపున భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. ఈవో బీఎం నగేష్, పి.వాసు తదితరులు పాల్గొన్నారు.

వన మల్లికార్జునుడికి జలాభిషేకం

మొగల్తూరు, ఆగస్టు 12 : మొగల్తూరు వడయార్‌పేటలో వెలిసిన స్వయంభూలింగేశ్వర వన మల్లికార్జునుడికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఉత్తర భారత దేశంలో నిర్వహిస్తున్నట్టుగానే దక్షిణాదిలోని మన ప్రాంతంలోనూ నిర్వహించాలనే ఆలోచనతో 25 కావిడిలతో నరసాపురం గోదావరి నుంచి జలాన్ని తీసుకువచ్చి స్వామికి అభిషేకం చేశారు. శ్రావణమాసంలో 5 సోమవారాలు జలాభిషేకం నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించడంతో ఎరెండో సోమవారం జలాభిషేకం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి జలాభిషేకంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి : ఎంపీపీ

» సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ తరగతుల ప్రారంభం



ఆచంట శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

ఆచంట/నరసాపురం రూరల్/పాలకొల్లు రూరల్/ఉండి/పెనుగొండ/ తాడేపల్లిగూడెం రూరల్/గణపవరం, ఆగస్టు 12 : ఆచంట మండలం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అన్నారు. గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన పదార్థాల నిర్వహణ, చెత్త సేకరణ వంటి వాటిపై సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ తరగతులు జరిగాయి. మొదటి రోజు శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో పి.నరసింహప్రసాద్, ఈవోపీఆర్‌డీ మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు. నరసాపురం మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ సోని అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎం.అనుపమ ఆధ్వర్యంలో, ఉండి మం డలం ఉండిలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవీంద్ర, ఈవోపీ ఆర్‌డీ రామకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో, పెనుగొండ మండలం మండల పరిషత్ కా ర్యాలయంలో ఎంపీడీవో సుందం శ్రీనివాస దొర ఆధ్వర్యంలో, తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ ఆధ్వర్యంలో, గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ, రిసో ర్స్‌పర్సన్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

గణపవరం, ఆగస్టు 12:మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ అప్పారావును టీడీపీ, జనసేన నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అప్పారావును సోమవారం కలిసి వారు శుభాకాంక్షలు తెలిపి మండల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, టీడీపీ నాయకులు కాపారం చిన్న, పల్లి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కూసంపూడి జగపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

డీఎన్ఆర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

పాలకొల్లు, ఆగస్టు 12 : విద్యార్థి సంఘం బలోపేతంగా ఉండాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షురాలు యామిని అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఆవరణలో వేడుకలు నిర్వహించారు. సంఘ మాజీ నాయకులు పీఎస్ ప్రతాప్‌రాజు మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని బెనారస్ యూనివర్సిటీలో భగత్ సింగ్ స్ఫూర్తిగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడు సుందర్, కుమార్, లోకేష్, వీరేంద్ర కుమార్, కౌశిక్, మహిమ, సాంసంగ్, నవీన్, సుధీర్ పాల్గొన్నారు.

ఆచంట ఎస్ఐగా కట్టా వెంకటరమణ

ఆచంట, ఆగస్టు 12 : ఆచంట ఎస్ఐగా కట్టా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మొగల్తూరు ఎస్‌గా పనిచేస్తూ బదిలీపై ఆచంట వచ్చారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతలు తీసుకుంటానని ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్ఐకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

చెరువులో నీరు తాగలేం

» కొప్పర్రు గ్రామస్థుల ఫిర్యాదు

నరసాపురం రూరల్, ఆగస్టు 12: సుమారు ఆరువేల మంది జనాభా నివాసం ఉంటున్న కొప్పర్రు గ్రామంలో రక్షిత నీరు అందడం లేదు. చెరువు పూడిక తీయకపోవడం, అధ్వానంగా ఫిల్టర్‌బెడ్‌లు, పైప్‌లైన్‌ల ద్వారా మురికినీరు సరఫరా కావడంతో ప్రజలు ఈ నీరు తాగేందుకు భయందోళన చెందుతున్నారు. అనేక మార్లు చెరువును ఆధునికీకరించాలని విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి గ్రామంలో మంచినీటి చెరువులో నీరు బాగోలేదని ఆర్డీవో అంబరీష్‌కు ఫిర్యాదు చేశారు. మా చెరువును పరిశీలించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు.

మోటార్లు మాయం

ఆకివీడురూరల్, ఆగస్టు 12 : ఆకివీడులోని ఇరిగేషన్ కార్యాలయంలో విద్యుత్ మోటార్లు, డోర్లు కనబడడం లేదని కళింగపాలెంకు చెందిన పూజారి వరప్రసాద్ 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. డీసీ మాజీ ఛైర్మన్ తోట ఏడుకొండలు హయాంలో రైతులు నీళ్ళు తోడుకునేందుకు విద్యుత్ మోటార్లు, వరదలు సమయంలో నీరు రాకుండా లాకులకు బల్లలు సమకూర్చి కార్యాలయంలో ఉంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

తణుకును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నిలపాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 12 :తణుకును క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా నిలుపుకోవాలని దానికి ప్రజలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. తణుకు మున్సిపల్ కార్యాల యంలో సోమవారం ఆయన క్లీన్ తణుకు - గ్రీన్ తణుకు పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో పారిశుధ్యం పడకేసిందన్నారు. డ్రెయినేజీల్లో సిల్ట్ తీస్తుంటే వాటి నిండా ప్లాస్టిక్ వస్తువులు ఉంటున్నాయని ఇటువంటి వాటికి ఇకపై చెక్ పెట్టాలన్నారు. దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకన్నబాబు, బసవా రామకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, కలగర వెంకటకృష్ణ, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, అవినాష్, బీవీ రమణ, ఎం. సూర్య ప్రకాష్, తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి అన్నక్యాంటీన్ల పునఃప్రారంభం



దాతను సత్కరిస్తున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 12: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతాయని, పేదల కల సాకారం కానుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద సోమవారం వెంకట్రామన్నగూడెంకు చెందిన జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రాంలక్ష్మణ్ సహకారంతో అన్నసమా రాధన నిర్వహించారు. ఈ సందర్భంగా దాత రాంలక్ష్మణ్‌ను సత్కరించారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, వాడపల్లి సుబ్బరాజు, సురగాల రాంబాబు, దాట్ల జగన్నాథరాజు, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పరమవీర చక్ర సంజయ్‌కుమార్‌కు సత్కారం



సంజయ్‌కుమార్ కాళ్లు కడుగుతున్న టీబీఆర్ చైర్మన్ భోగేశ్వరరావు దంపతులు

పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 12: విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని కార్గిల్ యుద్ధ వీరుడు, పరమవీర చక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్ అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం సంజయ్‌కుమార్‌ను టీబీఆర్ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తొలుత ప్రాంగణంలో ఉన్న అమరజవాన్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ భోగేశ్వరరావు దంపతులు ఆయన కాళ్లను పాలతో కడిగి సత్కరించారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిలిటరీ మాధవరం స్ఫూర్తి : సంజయ్‌కుమార్

దేశ రక్షణ కోసం పరితపించే రాబోయే తరాల సైనికులకు మిలిటరీ మాధవరం స్ఫూర్తిగా నిలుస్తుందని కార్గిల్ యుద్ధవీరుడు సంజయ్ కుమార్ అన్నారు. మిలిటరీ మాధవరాన్ని సోమవారం ఆయన సందర్శించి అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు.

61 టన్నుల పశువుల దాణా పంపిణీ

యలమంచిలి, ఆగస్టు 12: వరద ప్రభావిత లంక గ్రామా ల్లో మూగజీవాలు ఆర్థాకలితో అలమటించ కూడదని మంత్రి నిమ్మల రామానాయు డు ఆదేశాల మేరకు మండలంలోని పాడిరైతులకు 61 టన్నులు పశువుల దాణా ఉచితంగా పంపిణీ చేశామని మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కనకాయలంక, పెదలంక, ఏనుగువానిలంక, బాడవ, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక గ్రామాల్లో 646 మంది పాడిరైతులకు రూ.9,63,800 విలువ చేసే పశువుల దాణాను పంపిణీ చేశామని తెలిపారు.

అమర వీరులకు నివాళి



అమరవీరుల స్తూపం వద్ద సీపీఎం నేతల నివాళి

ఆచంట, ఆగస్టు 12 : త్యాగజీవుల ప్రజా పోరాటాల చరిత్రను స్మరించుకుని వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ప్రజల కోసం ప్రాణాలు సైతం అర్పించేవారు చాలా తక్కువ మంది ఉంటారని అటువంటి అమరవీరులు ప్రేరేప మృత్యుంజయుడు, తాళ్ళ బసవ మల్లయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమవరం, పెనుమంచిలి, ఆచంటలో ఉన్న అమరవీరుల స్తూం వద్ద సీపీఎం జెండాలను ఆవిష్కరించారు. అమర జీవులైన దిగుపాటి ప్రకాశరావు, నార్గన నరసింహమూర్తి, పంది నరసింహమూర్తి తదితరులు స్తూపాల వద్ద సీపీఎం నాయకులు జెండాలు ఆవిష్కరించి నివాళులు అర్పించారు. కేతా గోపాలన్, జక్కంశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అర్చకుడు భాస్కరశర్మ మృతి



భాస్కరశర్మ(ఫైల్)

భీమవరంటౌన్, ఆగస్టు 12 : కొత్త బస్‌స్టాండ్ వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి ఆలయంలో 40ఏళ్లుగా ప్రధానార్చకుడిగా స్వామికి సేవలుఅందిస్తున్న ఘంటసాల భాస్కర శర్మ(60) అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి తెలుసుకున్న విశ్వహిందూపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపి కుటుంబసభ్యులు పరామర్శించారు. భీమవరం, గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. వేలూరి కిరణ్, మారెళ్ల ఐలేష్ ఉన్నారు.